క్లుప్తంగా

పుష్కలంగా సాగునీరు



అంబాడ వద్ద మడ్డువలస ప్రధాన కుడి కాలువలో జలకళ

రేగిడి: మడ్డువలస ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా పంట పొలాలకు పుష్కలంగా నీరు అందుతోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రధాన కుడి కాలువకు లైనింగ్ పనులు చేయడంతో సాగునీరు గలగలా పారుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన నీరు ప్రాజెక్టులో ఉండడంతో ఈ ఏడాది పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నేటి గ్రామసందర్శన రద్దు

బొబ్బిలి రూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రతి గురువారం చేపడుతున్న గ్రామసందర్శన కార్యక్రమాన్ని తాత్కాలికంగా ఈ వారం రద్దు చేస్తున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీ కావడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉన్నందున ఈ గ్రామ సందర్శనను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మొక్కలు అల్లుకున్న ట్రాన్స్‌ఫార్మర్

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ప్రధాన ఆర్అండ్‌బీ పక్కన జనావాసాలు మధ్య ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కలుపుమొక్కలు, తీగలు అల్లుకున్నాయి. వీటిని తొలగించకపోవడంతో వర్షం సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడం, ప్రమాదాలు సంభవించడం జరుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఉన్న తీగలు తొలగించి, కంచె ఏర్పాటు చేయాలని పొనుగుటివలస గ్రామస్తులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.


మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో బుధవారం గ్రామైఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించారు. పొదుపు నిల్వతో పాటు స్త్రీనిధి రుణాలు వినియోగం, చెల్లింపుపై ఆరా తీశారు. సక్రమంగా విని యోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు



నాయరాళ్లవలసలో కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని నాయరాళ్లవలస, బూరాడ, తాటిపాడు, లచ్చన్నవలస తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకడంతో పంట పాడవుతోంది. ఏఓ జి.మురళీకృష్ణ, ఏఈఓ లీలామోహన్‌లు బుధవారం నాయరాళ్లవలస గ్రామంలో కత్తెర పురుగు సోకిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటి నివారణకు బెంజోయేట్ 100 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దానిలో ఒక లీటరు వేపనూనె కూడా వేసి ఆకు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేస్తే కత్తెర పురుగును నివారించవచ్చన్నారు. వలంటీర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

రాజాం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విద్యార్థులకు బుధవారం పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు అందజేసి, విద్యార్థినిల హాజరు శాతంపై ఆరా తీశారు. ఉత్తీర్ణతా శాతాన్ని బాగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పని చేద్దాం



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

- అధికారులను కోరిన స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని 31 వార్డుల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, కుక్కల బెడద వంటి సమస్యలను సమష్టిగా పరిష్కరించేందుకు అధికారులు ముందుకు వచ్చి పూర్తిగా సహకరించాలని స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండా ప్రాప్తికి వార్డుల వారీ ప్రతిపాదనలను కౌన్సిలర్లంతా ఆలకించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జీరో అవర్‌లో పట్టణంలోని తాగునీటి సమస్య ఉందని, చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, వ్యాధులు సోకే ప్రమాదాలు పొంచి ఉన్నాయని కౌన్సిలర్లు ముక్తకంఠంతో అన్నారు. ఒక్క పట్టణ సీహెచ్‌సీలోనే ఇటీవల కాలంలోనే 50 మందికి పైగా కుక్క కాటు బాధితులు చికిత్స పొందుతున్నారని కౌన్సిలర్ రాంబార్కి శరత్ అన్నారు. చిన్న విషయంగా కనిపించినా చాలా పెద్ద ప్రభావం చూపిస్తున్న యాంటీ బర్త్ కంట్రోల్ చికిత్సలను చేయించి ప్రజలను కాపాడాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొందని వైస్ చైర్మన్ చెలికాని మురళి అన్నారు. వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు కౌన్సిలర్లను పిలవకుండా ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని కౌన్సిలర్ వెలగాడ హైమావతి ఆరోపించారు.

పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ దోమలతో సతమతమవుతున్న ప్రజలకు ఆవులు కూడా రాత్రి వేళల్లో రోడ్లు పాడు చేసి ఇబ్బందులు కలుగ చేస్తున్నాయని కౌన్సిలర్లు అన్నారు. అలాగే మేదరి బంద మార్కెట్ అనుసరించి ఉన్న రోడ్డులో ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. కౌన్సిలర్ల ప్రశ్నలకు చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఏఈ సురేష్ తదితరులు సమాధానమిచ్చారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బొబ్బిలి రూరల్: ఆగంతకుల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాను సైబర్ నేరగాళ్ల బాధితుడినేనని, తనకు ఆగంతకుల నుంచి ఫోన్లు వస్తున్నాయని వివరించారు. ఇతర దేశాల నుంచి మీకు కొన్ని విలువైన వస్తువులు వచ్చాయని, మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబరు చెప్పాలని, ఇటీవల పదేపదే ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి సైబర్ క్రైంల పట్ల గ్రామీణ ప్రాంత వాసులకు అవగాహన కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పోలీసుల సహకారంతో అవగాహన కల్పించేందుకు కార్యాచరణను తీసుకొస్తామని వివరించారు. పిరిడి సచివాలయ మహిళా సిబ్బందికి ఫోన్లలో అశ్లీల వీడియోలు పంపి వారిని మానసికంగా హింసిస్తున్న ఘటనలను చూస్తున్నామని, ముఖ్యంగా మహిళలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్ నంబర్లను ఇవ్వరాదని సూచించారు.

సకాలంలో రేషన్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ జరుగుతున్న రేషన్ సరుకులను లబ్ధిదారులకు సకాలంలో సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకులను పంపిణీ చేసే విధానంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. బహిరంగ మార్కెట్లోకి రేషన్ బియ్యం వెళ్తున్నట్టు తనవద్ద సమాచారం ఉందన్నారు. అక్రమ మార్గంలో రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూకం, తరుగులు లాంటి సంఘటనలపై ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో ఆర్ఐ సాయికృష్ణ, సీహెచ్‌డీటీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు



భోజనం నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈఓ

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని ఎంఈఓ తిరుమలప్రసాద్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రోజుకో వంటకంతో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. మెనూ ప్రకారం వంటలు చేయాలని సూచించారు. వంటలు అనంతరం ప్రతీ ఆహారంపైన మూతలు పెట్టాలని, వేడి వేడి భోజనం పెట్టాలని ఆదేశించారు. భోజన నాణ్యతలో తేడాలొస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు తదితరులు

రాజాం సిటీ: ఇటీవల రాజాం మీదుగా గంజాయి రవాణా అధికమౌతున్న కారణంగా పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. బుధవారం వేకువజామున స్థానిక పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ కేర్ జంక్షన్‌లో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. మోటార్ సైకిళ్లు, లారీలు, వ్యాన్‌లు, బస్సుల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. ఎస్పీ ఆదేశాలు మేరకు గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టేందుకు దృష్టి సారించామని సీఐ తెలిపారు. సంతకవిటి ఎస్ఐ షేక్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ మోహనరావు

బొబ్బిలి: చేతుల పరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యపు అలవాట్లకు నాంది అని డిప్యూటీ ఈఓ మోహనరావు అన్నారు. ఈ ఏడాది విద్యార్థుల చేతుల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేతుల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఇతర అలవాట్లను జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించేందుకు డీబీఎస్ఐ సంస్థతో కలసి పాఠశాల విద్యాశాఖ ఏడాది పొడవునా చేపడుతోందన్నారు. చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో ఏడు రకాల సూత్రాలను పాటించాలన్నారు. ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాలల్లో స్టూడెంట్ కాబినెట్, సోప్ బ్యాంక్ వంటి కొన్ని విధానాల ద్వారా పరిశుభ్రతపై మక్కువ కలిగేలా ఉమ్మడి ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. డాక్టర్ టి.లక్ష్మి, డీబీఎస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వి.భగవాన్‌దాస్, రీసోర్స్‌పర్సన్ శంకరరావు, చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు చిట్టిబాబు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

బొబ్బిలి రూరల్: మండలంలోని సామాజిక పెన్షన్లను పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం తెలిపారు. ఆగస్టు నెలకు సంబంధించి మండలంలో 30 గ్రామ పంచాయితీలకుగాను 22 గ్రామ సచివాలయాలున్నాయని అందులో పని చేస్తున్న సిబ్బందితో పింఛన్ల పంపిణీకి పూర్తి ఏర్పాట్లు అయ్యాయని తెలిపారు. మొదటిరోజు 100శాతం పంపిణీకి ఆదేశాలిచ్చామని తెలిపారు.

పకడ్బందీగా పింఛన్లు పంపిణీ చేయాలి

రామభద్రపురం: సామాజిక భద్రత పింఛన్లు పంపిణీలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. తన కార్యాలయంలో ఈవోపీఆర్డీ వెంకటరమణతో కలిసి బుదవారం ఆమె పంచాయతీ కార్యదర్శులు, పింఛన్ల పంపిణీ చేసే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తేదీన వేకువజామున ఐదో గంట అయ్యేసరికి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేయాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

రాజాం సిటీ: పట్టణ పరిధి మారుతీనగర్ ఒకటవ లైన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఏం జరుగుతుందోనని కాసేపు ఆందోళనకు గురయ్యారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. మారుతీనగర్‌కు చెందిన సీహెచ్ మోహనరావు ఇంట్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలుతో పాటు పొగ వ్యాపించింది. ఇంట్లో కుటుంబ సభ్యులంతా ఆందోళనతో బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని ఫైర్ ఎస్ఐ టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు.

తెర్లాం తహసీల్దార్‌గా హేమంత్‌కుమార్



తెర్లాం: మండల తహసీల్దార్‌గా జి.హేమంత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఆనందపురంలో తహసీల్దార్‌గా పని చేసి ఇటీవల జరిగిన బదిలీల్లో తెర్లాం తహసీల్దార్‌గా ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరడంతో హెచ్‌డీటీ గాడి భాస్కరరావు, సీఎస్‌డీటీ స్వర్ణలత, ఆర్ఐ భాస్కరరావు, మండల సర్వేయర్ వెంకటరమణలతో పాటు వీఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అందరం సమష్టిగా కలిసి పనిచేద్దామని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు అవసరమైన సేవలను త్వరితగతిన అందిద్దామని అన్నారు.

తహసీల్దార్‌గా కల్యాణచక్రవర్తి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సంతకవిటి: స్థానిక తహసీల్దార్‌గా టి.కల్యాణ చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ తిరుమలరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లడంతో పాడేరు తహసీల్దార్‌గా పని చేస్తున్న కళ్యాణ చక్రవర్తి ఇక్కడకు బదిలీపై రావడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పలువురు వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యుత్ చౌర్యం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామం వద్ద ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ చౌర్యం జరుగుతోంది. బుధవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పంట పొలాలకు మోటార్ ఇంజిన్ సాయంతో నీటిని అందిస్తున్నారు. ఈ మోటారుకు దగ్గర్లో ఉన్న విద్యుత్ స్తంభాలు నుంచి దొడ్డిదారిన కనెక్షన్ ఇచ్చి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాడు. పట్టపగలే ఇలా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

తెర్లాం: ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్ఓలంతా వారు పని చేస్తున్న గ్రామాల్లో ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను తాత్సారం చేయకుండా వెంటనే పరిష్కరించేందుక కృషి చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాలల్లో ప్రవేశాలు అవుతున్నాయని, విద్యార్థులు కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే వారికి ఇబ్బంది లేకుండా చేయాలని తహసీల్దార్ కోరారు. సమావేశంలో హెచ్‌డీటీ గాడి భాస్కరరావు, సీఎస్‌డీటీ స్వర్ణలత, ఆర్ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు : ఏఓ



సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ

బొబ్బిలి రూరల్: రైతులు తమ పంట పొలాల్లో ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులను వినియోగిస్తున్నారని, వీటికి బదులు సేంద్రియ ఎరువులనే వాడాలని ఏఓ ఎం శ్యాంసుందర్ సూచించారు. మండలంలోని కోమటిపల్లిలో వరినాట్లు వేసుకునే విధానాన్ని రైతులకు బుధవారం వివరించారు. అనంతరం సేంద్రీయ ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. వరి పంటకు డీఏపీ, యూరియా, పొటాష్ వంటి రసాయనాలు వాడితే వచ్చే చీడపీడలను నివారించేందుకు అదనంగా డబ్బు ఖర్చు చేసి పురుగుల మందులను కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. కేవలం 30 గ్రాముల వేస్ట్ డీకంపోజర్‌తో 200లీటర్ల ద్రావణం తయారు చేసుకోవచ్చని, లీటర్ ద్రావణాన్ని ఎకరాకు 4మార్లు వినియోగిస్తే సరిపోతుందని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల పారితోషికం చెల్లింపునకు వినతి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న సచివాలయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: గత ఎన్నికల్లో గ్రామ సచివాలయాల సిబ్బందిని బీఎల్‌ఓలుగా ప్రభుత్వం విధులను అప్పగించిందని, కానీ దానికి రావాల్సిన వేతనాలు తమకు చెల్లించలేదని అలజంగి గ్రామ సచివాలయ సిబ్బంది వాపోయారు. బుధవారం తహసీల్దార్ శ్రీనును కలసి తమ గోడువెళ్లగక్కారు. ఎన్నికల్లో విధులను నిర్వహించిన అన్నీ శాఖల ఉద్యోగులకు పారితోషికాన్ని ప్రకటించి ఇచ్చారని, సచివాలయ సిబ్బందికి మాత్రం ఇవ్వడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీఎల్‌ఓలుగా విధులు నిర్వహించిన తమకు వేతనం చెల్లించాలని తహసీల్దార్‌ను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ శ్రీను వారికి భరోసా ఇచ్చారు.

రైతువారీ పనులపై దృష్టి సారించండి



ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు.

రాజాం: ఉపాధి పనులు కావాల్సిన వేతనదారులకు రైతులకు ఉపయోగపడే పంట కాలువల్లో పూడికలు తొలగించడం, చెరువుగట్లును బాగు చేయడం వంటిపనులు కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు డిమాండ్ తగ్గడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో ప్రజలకు అందని ఉపాధి వేతన బకాయిలపై అధికారులకు తెలియజేశారు. గ్రామాల్లో వేతనదారులు తమను నిందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా బకాయిపడిన వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆందోళన



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు విశ్వాసం కోల్పోతున్నారని ప్రభుత్వం తక్షణమే మేల్కొని సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రీప్రైమరీతో పాటు 1నుంచి 5 తరగతుల వరకు ఒకే పాఠశాలను నిర్వహించాలన్నారు. జీఓ 117ను రద్దు చేసి ఎంఎస్ 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్లస్‌టు పాఠశాలలను ఏర్పాటుచేయాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయాలని, హైస్కూల్‌లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలంటూ పలు సమస్యలపై ఎంపీడీఓ పి.రవికుమార్, ఎంఈఓ లక్ష్మణరావులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యురాలు వి.విజయగౌరి, ప్రసన్నకుమార్, పట్టణ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, శ్రీనివాస్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సచివాలయం ప్రారంభం



బూరాడలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, వావిలపల్లి నాగభూషణరావు, గులివిందల శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఏఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీదేవికి పూజలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతిదేవి అమ్మవార్లు శాకాంబరీ దేవిలుగా భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఏటా ఆషాడమాసంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ శివకేశవరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు శర్మ తెలిపారు. రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం కల్పించిన అనంతరం అమర్చిన కూరగాయలతో మహాన్నదానం చేస్తామని తెలిపారు.

ఊపందుకున్న ఉబాలు

రేగిడి: మండలంలో వరి ఉబాలు ఊపందుకున్నాయి. మడ్డువలస కాలువలు ద్వారా సాగునీరు పొలాలకు పుష్కలంగా అందుతుండడంతో ఉబాలు జోరందుకున్నాయి. అంబఖండి, కోడిశ, వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, సోమరాజుపేట తదితర గ్రామాల్లో ఉబాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది సకాలంలో వరినాట్లు పూర్తయ్యాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సుందరంగా పట్టణం



కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ప్రజా సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందిదేనని కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా, రామా టాకీస్ రోడ్డు, ఎన్టీఆర్ జంక్షన్, వేణు గోపాల స్వామి సెంటర్లలో ఆమె సిబ్బందితో కలసి బుధవారం పర్యటించారు. కాలువలలో సిల్టును తొలగించి మురుగు పారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

వంగర: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ వై.వి.జనార్దన్ తెలిపారు. మండల పరిధి రుషింగి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి వాహనదారులు వేగం వెళ్లరాదని, ప్రమాదాలు జరిగిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడతారని చైతన్యం చేశారు. హెచ్‌సీ సుగుణాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 270 మంది విద్యార్థులకు బుధవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం బి.విశాలాక్షి ఆధ్వర్యంలో ఆశావర్కర్లు సహకారంతో రక్త నమూనాలు సేకరించి హెచ్‌బీ వివరాలను వెల్లడించారు.

పోలీసులకు ఫిర్యాదు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన తన భార్య, తొమ్మిదేళ్ల కుమారుడు కనిపించడం లేదని భర్త బుధవారం ఫిర్యాదు చేశాడని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. జూలై 7 నుంచి కనిపించకుండా పోయారని, అప్పటి నుంచి తెలిసిన వారి ఇళ్లతో పాటు అన్ని చోట్ల వెతికామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. ఫలితం లేకపోవడంతో తమను ఆశ్రయించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.